దయ్యము*

వేలూరి శివరామశాస్త్రిగారు

శ్రీనారాయణరావు నిజాముకాష్ట్రమునందలి ఫతే పూరు జమీందారు. అతనికి అరబ్బీ, ఉరుదు భాషలే కాక యింగ్లీషుకూడ లెస్సగా వచ్చును. మాతృభాష యగు తెలుఁగు విషయమున అతనికి హిందూ ముస్లిం యూనిటీ చాల సెక్కువ. దాని కేమి? ఆయన పెద్ద స్పిరిచుయలిస్టు. అనఁగా దయ్యాల శాస్త్ర మెఱిఁగినవాఁడు.

వర్ణవిభాగము హిందూదేశ పతనమునకు కారణ మని పెద్దపెద్ద లందఱు ఒకమూల నెత్తికి నేలకు కొట్టు కొనుచుండఁగా నారాయణరావు దయ్యములలోఁగూడ వర్ణవిభాగము కలదని కనుఁగొని వర్ణవిభాగము అసలు సృష్టిలోనే కలదని నిర్ధారణచేయ మొదలుపెట్టెను.

ఆయనకన్న దొడ్డ పరిశోధకురాలు ఆయన భార్య మాలతి. ఆమె యెప్పుడును ముక్కు మూసికొని ప్లాంకెట్ (ముక్కాలిపీఁట) ముందరనే కూరుచుండును. ఆమె ఆహ్వానింపఁగనే దయ్యములు తయారు. 'దయ్యములుగూడ నిన్నే వలచిన' వని నారాయణరా వనును. 'మీరుఁగూడ మా fair sex (స్త్రీల) లోనికి రం' డని మాలతి యనును. 'రాను రాను; నేను దయ్యముల లోనికి పోదు'నని మగఁ డనును. 'ఇపు డేమి తక్కువ?' అని భార్య యనును.

మాలతి ముక్కాలిపీఁట యెప్పుడును మ్రోఁగుచునే యుండును. ఆమెగది ఒక టెలిగ్రాఫు-ఆఫీసు.

ఆమె దాసీజన మంతయు ఆమెకంటె పెద్ద స్పిరిచుయలిస్టులు. మాలతికి దయ్యములు ముక్కాలిపీఁట మీఁద సంజ్ఞారూపముగమాత్రమే కనఁబడును. దాసికల కన్నులకే అవి కనఁబడి తప్పించుకొనిపోవుచుండును.

'జ్వరము సోఁకి నేను మేడవసారాలో పడుకొని యుంటిని. చక్కనిచీర కట్టుకొని రూకంత బొట్టు పెట్టుకొని ఒకదయ్యము నాపక్కనుండియే రివ్వన వెళ్లెను' అని అచ్చి వాడ యంతయు మోఁగిపోవునటులు చెప్పెను.

'అషైతాన్ మాలతీ బీగమ్ కాదుగదా' అని రసూల్ సాహెబ్ అడిగెను.

'ఆరే, బిగ్గఱగా అనకు! దెబ్బలు తినకు!' అని అచ్చి అనెను.

మాలతి దాసికలలో ఫాతిమా బీబీ యొకతె. తురక దయ్యములుకూడ నున్నవని అది పరిశోధన చేసి నిశ్చయించెను. ఫాతిమా యిపుడు రెండవతూరి పెండ్లాడుటకు ప్రయతించుచుండెను. ఫాతిమాబీబీ గతించిన భర్త అంపకారి. అంపకోఁతలో టేకుమాను విఱిగి అతనిపైఁ బడెను. అతఁడు వెంటనే మరణించెను. అతఁడు మరణించినపిదప రెండేండ్లకు ఫాతిమా ఆగోతి ప్రక్కగాఁ బోవుట తటస్థించెను. ఫాతిమాకు అంతయు గుఱుతు వచ్చెను. దానికాళ్లు వడఁకెను. చెమట పోసెను. 'ఇంకను నాస్తా కాలేదా?' అని తప్పఁద్రాగి అంపముతో అతఁ డొకతూరి ఫాతిమా వెంటఁ బడెను. ఇపు డా స్వరూపము దానికి గోచరించెను. గోచరించుట యేమి, అంపముతో వెనుకకు రానే వచ్చెను. ఫాతిమా కెవ్వన కేక పెట్టెను. విఱుచుకొని పడెను. బందుగు లందఱు ప్రోగయిరి. తురకమంత్రములు పెట్టించిరి. లాభము లేకపోయెను. హిందూమంత్రములు పెట్టించిరి. కొంచెము తెలివి కలిగెను. అపుడు మాంత్రికు లందఱు తురక దయ్యములకు హిందూ చెప్పుదెబ్బలును, హిందూదయ్యములకు తురక చెప్పుదెబ్బలును ఉపయోగించుట లాభకారి యని గుర్తించిరి. కొంతపడికి ఫాతిమాకు తెలివి

*ఇందలి ప్రధానాంశమునకు స్వర్ణలతాదేవితోపాటు నేనును ఒక అజ్ఞాతరచయితకు చాలఋణగ్రస్తుఁడను.

వచ్చెను. ఆమె 'తనభర్త దయ్యమై తనను పట్టుకొనె'నని చెప్పెను. నమ్మకముకొఱకు తనచేతిమీఁద అంపపుగుఱుతులుగూడ ఆమఱునాఁడు ఫాతిమా అందఱకును జూపెను. అభయముతో ఫాతిమా నెవరును పెండ్లాడలేదు.

'ఆఁడువారికంటె మగవారికి ప్రేమ యెక్కువ. చచ్చినను రుస్తుంసాహెబు ఫాతిమాను వదలలేదు. మాచి తిరా ఫాతిమా పెండ్లాడఁదలఁచినది!' అని హైస్కూలులోని సైకాలజిస్టులు సారాంశము తేల్చిరి.

ఈతురకదయ్యముగూడ మాలతిబల్లమీఁది కెక్కెను. తాను ఫాతిమాను అంపముతో కోసినటులుగూడఁ జెప్పివైచెను. మాలతి ఫాతిమాకు ఆ సంగతి చెప్పినపుడు ఫాతిమా లోలోపల నవ్వుకొని 'అమ్మా' అని చేయి మాచుకొనెను.

ఈదయ్యమే కాక పట్నములో నున్న దయ్యములు చాలవఱకు మాలతి ముక్కాలిపీఁటమీఁదఁ గాని, నారాయణరావు ముక్కాలిపీఁటమీఁదఁ గాని అధిష్ఠించుచునే యుండును. ప్రతిదినము కొందఱు భక్తులు అచటికి వత్తురు. చనిపోయిన తమబంధుగులను మాలతికి విన్నవింతురు. ఆమె దయ్యముల నాహ్వానించి వారికి ఇష్టములగు వస్తువులు ఫలానా అని చెప్పును. వారా మ్రొక్కుబడులు చెల్లించి పరితృప్తి చెందుచుందురు.

ఇదివఱకు దేవతలకే దేవళములు కలవు. ఇపుడు దయ్యములకు ఈమేడ ఒక క్రొత్తదేవళ మాయెను.

నారాయణరావు కుమారుఁడు కాంతారావు. అతఁడు ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్. ఎల్. బి. పరీక్ష నిచ్చెను. అతని కాడిగ్రీతో చేయవలసిన పని అంతగా కానిపింపలేదు. కావున ఆడిగ్రీకూడ ఆదేవళమున ఒక ఉత్సవవిగ్రహముగా నుండెను.

కాంతారావు చిన్నస్పిరిచుయలిస్టు. ఆతఁడిపుడు పశువులకును, దయ్యములకును ఉండు సంబంధమును పరిశోధించుచుండెను. ఇంతియ కాక దివ్యజ్ఞానసమాజము వారి కూట్ హూమీగారితో సంభాషింప ప్రయత్నములు చేయుచుండెను. వీని యన్నిటికంటెను నాటకములలో వేషములు వేయుటయం దతని కభిరుచి మెండు. నాట్య మిపు డతని కభిమానశాస్త్రము; దయ్యాలశాస్త్రము దానితరువాత.

ఇటు లీకుటుంబమునకు ఇహలోకసంబంధముకంటె పరలోకసంబంధ మెక్కువ. సత్యప్రపంచముకన్న భావనాప్రపంచమున వారికి మనసు. మాటలాడుచు మాటలాడుచు వారు పరలోకమునకుఁ బోయి వచ్చుచుందురు. వారు నమ్మి నమ్మింతురు. మోసపడియు పరిశోధనలను ముగింపరు. ఇతరుల యాక్షేపణములకు అంతగా విచారింపరు.

మొహరము పండుగలలో ఈ దయ్యాలచర్చ చాల నెక్కువగ వచ్చెను. నారాయణరావు దయ్యములను గుఱించి ప్రతిదినము ఉపన్యసించుచుండెను. అసలే అతనిది బొంగురుగొంతుక. బిగ్గఱగా నుపన్యసించుటచే అతనిగొంతుక పసులఁగొట్టిన కంచాయెను.

నారాయణరావు ఒకరాత్రి అందఱను విందునకు పిలిచెను. విందు ఇంగ్లీషుపద్ధతిలో జరుగుచుండెను.

వచ్చినవారిలో వినాయకరావు మాటకారి. అతఁడు కొంచెము బ్రాంది పుచ్చుకొని, 'మీకుమారుఁడు కాంతారావు కనఁబడఁడేమి? దయ్యమయిపోలేదుగదా?' అనెను.

నారాయణరావు సీసా ఖాళీ చేసి, 'దయ్యమై మిమ్ములనే లంకించుకొనినటు లున్నాఁడు' అని బొంగుగ నవ్వు నవ్వెను.

'ఇంకను కాంతారావుకు పెండ్లిచేయలేదేమండీ?' అని వెంకోబారా వనెను.

'మంచిదయ్యము నొకదానిని మాబీగంసాహెబా దర్యాప్తు చేయుచున్న'దని నారాయణరా వనెను.

అందఱును నవ్విరి.

నారాయణరావు 'జోర్ ఏక్ షీషీ లెకావ్' అని బోయికి ఆజ్ఞాపించెను.

ఈసారావలననే దయ్యము లెక్కువై పోవుచున్న వని అనుకొనుచు బోయి సీసాకొఱకుఁ బోయెను.

మాధవరావు దిట్టముగా త్రావి యిటు లనెను—'శశశమీవృక్షముమీఁద పపప పాండవు లస్త్రము లుంచుటచే చెట్లకును దయ్యములకును సంబంధము జజజగ ద్విదితము.'

'భేష్! ఇది యొక క్రొత్తసారాంశమే.' అని నారాయణరావు నోటు బుక్కులో వ్రాసికొనెను.

'దయ్యములకే కాదు; దేవతలకును సంబంధము కలదు. రామకృష్ణ పరమహంసకు గంగయొడ్డున ఒక మర్రిక్రింద గొప్పసమాధి సిద్ధించెను. ఆయన ఈవలికి రాఁగనే ఆచెట్టు కొమ్మ ఫెళ్లున విఱిగి క్రిందఁ గూలెను.' అని వ్యాసారావు అనెను.

'కాదండీ! అది షైతాన్ మహత్తే!' అని నారాయణరా వనెను.

'మీరు మానవుల రాజ్యమే కాక దయ్యాలరాజ్యమునుగూడ పరిపాలించుచున్నా' రని హెడ్‌మాస్టరు క్వయాంసాహెబు అనిరి.

అందఱకును కొంచెము కొంచెముగా మత్తు తలపైకి ఎక్కఁజొచ్చెను. ఎవరి యిండ్లకు వారు వెళ్లిపోయిరి.

నారాయణరావు తూలుచు గోడ పట్టుకొని మెట్లెక్కి మేడపైకి వెళ్లెను. ఎల్లపుడును మూసియుంచఁబడు కాంతారావు గదితలుపు తెఱవఁబడియుండెను. అతఁ డందు ప్రవేశించెను. దీపము జేగంటవలె నుండెను. కాంతారా వచట లేఁడు. ఆరాత్రి నాటకము. చాల వేషములు మంచముమీఁదఁ బడియుండెను. నారాయణరావు ఒకొక్క వేషమునే తీసి పరిశీలించెను. రాజువేషములు, రాణివేషములు, విదూషకవేషములు, రకరకాల దయ్యాలవేషములు. అతఁడు ఆదయ్యములవేషములలో ఒకవేషమును ఏఱుకొనియెను. అటు ఇటు చూచి 'ఠీక్' అనుకొనియెను. ఆవేసమును తొడుగుకొనియెను. నిలువుటద్దమునఁ జూచుకొనియెను. 'ఠీక్ ఠీక్' అనుకొనియెను. మెల్లగా వసారాలోనికి వచ్చి మాలతిగదిగోడకు చెవి ఆనించి ఆలకించెను. ఫాతిమా మాలతికి తల దువ్వుచున్నటులు గ్రహించెను. వడివడిగా మేడ దిగి చదువుల గదిలో కుర్చీమీఁదఁ గూరుచుండెను. ఈ కిటికీ ప్రక్క నుండి ఫాతిమా వెళ్లఁగనే ఈవేసముతో మాలతికడకు వెళ్లి తమాషా చేసి దయ్యములు వట్టిభ్రమ యని నిరూపింతు ననుకొనెను. తాను ఆడవలసియున్న నాటకమంతయు సాంగోపాంగముగా ఆలోచించుకొనుచు ఒకకుర్చీమీఁదఁ గూరుచుండెను. అతఁడు ఇటులు ఆలోచించుకొనుచుండఁగా మత్తు ఒకమణుఁగు బరువుతో అతని తలమీఁద నెక్కి కూరుచుండెను. అతఁడు కుర్చీ ముందరిబల్లమీఁద తల యాన్చి కునికిపాటులు పడెను. ఆకునికిపాటులు మెలమెల్లగా నిద్రలోనికి దారి తీసెను.

మేడమీఁద ఫాతిమాబీబీకి పని యయిపోయెను. మెల్లగా మేడమెట్లు దిగి వచ్చెను. అదిచదువులగది తలుపులు కొంచెము తెఱచియుండుట చూచెను. దీపపుక్రీనీడ కడపమీఁద పడుచుండెను. అది లోపల తొంగి చూచెను. గడబిడపడెను. 'క్యారే నర్షప్పా! హింతా హింతా ఫాద్దు ఫోతే దర్వాజా దొంగావాలాకు హప్పా సెఫ్తాఫ్?' అని మరల తొంగి చూచెను. దీపపు వెలుఁగున దయ్యము బల్లమీఁద పడుకొని యుండుట స్పష్టముగా కనుఁగొనెను. ఫాతిమా ఉలికిపడెను. ఒకడుగు వెనుకకు వేసి 'ఆకే షైతాన్' అని మేడమీఁదికి పరువెత్తుకొని పోయెను.

ఫాతిమా ఇటులు త్రొక్కుడుపడుటచే గడియగర్రు మని మోఁగెను. నారాయణరావు మేలుకొనెను. ఫాతిమా 'షైతాన్'అని అఱచుట అతఁడు వినెను. భయపడెను. గోడలు తడుముకొనెను. కల్లుమత్తు నెత్తికెక్కుటచే నతనికి తిన్నగా స్పృహ లేదు. ఆతని రొమ్మెదుటనే నిలువుటద్ద ముండెను. అతనికి అందు వికారపు దయ్యపురూపు కానిపించెను. అతఁడు బయటికి వచ్చుచు 'దెయ్యం' అని వయ్యపు టఱపు అఱచెను. అతఁ డిటు లఱచునపుడు ఫాతిమా మేడమీఁదికి పరుగెత్తుచు 'బేగం సాహెబా! ధెయ్యమ్'అని కూలఁబడెను. నారాయణరావు అదియు మఱియొక దయ్యపు

పరాక్రమ మనుకొనెను. మేడమీఁదికిఁ బోవ భయ పడెను. గత్యంతరము లేక రోడ్డుమీఁదికి పరుగిడెను.

మేడమీఁదినుండి మాలతి చూచి—'దయ్యమదిగో రోడ్డుమీఁద! అదిగో ముందు! ముందు!' అని అఱచి వసారాలో కూలెను.

అచ్చి వచ్చి చూచి కెవ్వన కేక పెట్టి మూర్ఛిల్లెను.

నారాయణరావుగుండెలు టువ్వటువ్వ మనెను. 'మాలతిని పట్టుకొనక ఈ సైతాన్ నన్ను పట్టుకొను టేమి? అయ్యో! దెయ్యమ్ దెయ్యమ్' అనుచు రోడ్డుమీఁద పరువిడెను.

అతని దసలు పెద్దగొంతుక. మఱియు బండ గొంతుక. అందులో బొంగురుపోయెను. ప్రకృతము ప్రాణభయము. సారామత్తుచే సగము మెలఁకువ, సగము నిదుర; సగము తెలివి, సగము తెలివి తక్కువ. ఇట్టి అతని ఈ ప్రకృతధ్వని మనుజులదియు, జంతువులదియు, పక్షులది యుఁగూడఁ గాకుండెను. ఆవేసమునకు ఆధ్వని సరిగా నుండెను.

'ధెయ్యమ్, ధెయ్యమ్.'

రోడ్డుమీఁద బండిలో వచ్చుచు తొంగి చూచి మెహరున్నీసా! ఒక బట్టలఅంగడి కెదురుగా క్రిందఁ బడెను.

ఆ ప్రక్క మేడమీఁద నున్న మౌలానా ఇక్బల్ సాహెబు—'బేటీ బేటీ! అందర్. లేవ్! ఆకే హిందూదెయ్యం!! అమ్మాయిని ఇంటిలోనికి తీసికొని పో! దర్వాజా ముయ్యి, దర్వాజా ముయ్యి!' అనెను.

ఆ అంగడివాఁడు పీరుసాహెబు. అతఁ డొక పెద్ద బట్టల వర్తకుఁడు. మెహరున్నీసాను ప్రేమించు చున్నాఁడు.

కాని మౌలానాకు ఇసుమంతయు ఇష్టము లేదు. మౌలానా తన మేడ కెదురుగా నున్న యతని యంగడిని గూడ ఎత్తివేయింపఁ జూచుచుండెను. ఇట్టి స్థితిలో ఈదయ్యము!

పీరుసాహేబు దయ్యమును దూరదూరముగాఁ జూచి బిక్కుబిక్కు మనుచుండెను. బండివాఁడు 'ఊ జల్దీ' అని ఊఁత యిచ్చెను. పీరుసాహెబు మెహరున్నీసాను రెండుచేతులతో నెత్తుకొనిపోయి తలుపులు మూసికొనెను. బండివాఁడు బాడుగ అడుగకయే పాఱిపోయెను.

దయ్యము కొంచెము భయపడి, ముందరికి నడచెను.

మొహరములో బలి యిచ్చుటకు ఆవొకటి అచట కట్టఁబడి యుండెను. దానిచుట్టును మహమ్మదీయులు పలువురు పరివేష్టించియుండిరి. మౌలానా ఇక్బల్ మాటలు వారికి వినిపించెను. అప్పటి నుండియు వా రందఱును దారికేసి పొంచిపొంచి చూచుచుండిరి. వారి కపుడు ఆదయ్యపు ముఖము కానిపించెను.

'అరే సైతాన్!'

'ధెయ్యం ధెయ్యం.'

అందఱును కాళ్లు విఱుగఁ ద్రొక్కుకొనిరి. ఈ త్రొక్కులాటలో పలుపు తెంచుకొని ఆవుదారిని ఆవు పాఱిపోయెను. దయ్య మాపాకను సమీపించు వఱకు అచట నొకపిట్టయేని లేదు. ఒకఁడుమాత్రము కాల్లీడ్చుకొనుచు పాఱిపోవుచుండెను.

'ఔరా, దయ్యము నన్ను గట్టిగా లంకించుకొన్న' దని నారాయణరావు గబగబ పరుగెత్తఁ దొడఁగెను.

మఱునాఁటిప్రొద్దున ఆసుపత్రిలో షేక్ అలీ సాహెబు విఱిగిన మడమకు కట్టు కట్టించుకొనెను. హకీము విఱుగుటకు కారణ మడిగెను. 'రాత్రి హిందూదయ్యము మావెంటఁ బడెను. అందఱు పాఱిపోఁగా నేను దానిని తఱిమితఱిమికొట్టితిని. దయ్యము తోఁక మణఁచినది. నే నింటికి వచ్చువఱకు కాలు విఱిగియుండెను' అని షే కలీ చెప్పెను.

'దయ్యము తోఁక మణఁచుచో ఆవేల బలి యీయఁబడలేదు?' అని హకీ మడిగెను,

'హిందూముస్లిం యూనిటీ! గాంధి మమ్ముల్ను దేవురించాడుగా! అందుకని మేమే విడిచిపెట్టితిమి.'

'ఆ! ఎంత యూనిటీ! కాని నీమడమలో ఎముకకు యూనిటీ కష్టము!' అని హాకీ మనెను.

నారాయణరా వొకగల్లీలో పడెను. అచట నొక దొంగ రెంచితో తలుపు స్క్రూలు తీయుచుండెను. హఠాత్తుగా వానిముందర ఈదయ్యము!

దొంగచేతిలో రెంచి క్రిందఁబడి ఠప్పు మనెను.

దాని నెత్తి తననెత్తిమీఁదికి విసరునేమో యని దొంగమీఁదికి నారాయణరావు పరుగెత్తఁ దొడఁగెను. 'దయ్యం తనమీఁద పడనే పడె' నని దొంగ పరుగెత్తెను. దయ్యమునకు భయము తగ్గెను.

'నేనే దొంగ ననుకొంటిని. ఈరాత్రి దొంగదయ్య మొకటి నన్ను మ్రింగవచ్చెను. అమ్మో, ఎంత దయ్య మనుకొంటివి? నా మెడ నోటిలో పెట్టుకొనునదే! ఎటులు తప్పెనో నే నెఱుఁగను. చావుపరుగు పరుగెత్తితిని. రేపటినుండి ఇఁక దొంగతనము చేయను' అని ఆ దొంగ తన భార్యతో అనెను.

'ఇఁక దొంగతనము చేయనిచో మన కెటులు గడచును?' అని భార్య యనెను.

'ఇంకా దొంగతనమే?' అని ఆదొంగ భార్యను బట్టుకొని యేడ్చుచు, 'పగటిపూఁట ముష్టియెత్తుకొందము, రాత్రి వద్దుసుమా!' అనెను.

నారాయణరావు ఆదొంగను తప్పుకొని పేరెము దీసెను. అక్కడికి సీమాంతము. గోరీలదిబ్బయు, శ్మశానమును ఆదాపుననే.

శ్మశానమున ఒకపెద్ద మర్రిచెట్టు కలదు. దాని మీఁద నడిరేయిని దయ్యములు బావురు గీవురు మని పోట్లాడుచుండునని వాడుక. కావున అది దయ్యాల మర్రి అయిపోయెను.

నాఁటి సాయంకాలము హైస్కూలులో పెద్ద విద్యార్థులు కొందఱు ఆ మర్రికడకు నడిరేయి ఎవరును వెళ్లలేరనియు, మఱికొందఱు 'ఆ, వెళ్లలే' రేమనియు తగవులాడిరి.

ఖాదర్ సాహెబు ఱొమ్ము విఱిచి 'నేను వెళ్లెద' ననెను.

'పందె మెంత?'

'పదిరూపాయలు.'

'సరే గాని ఆమర్రిరొట్ట ఒకబుట్టెఁడు కోసికొని రావలెను.'

'బుట్టెఁడు కాదు; తట్టెఁడు తెత్తును.'

'మంచిది.'

పందెమిటులు ఫైసలాయెను. ఆనడిరేయిని ఖాదరు ఒకబుట్టతో మర్రిని మిర్రి చూచుచు మెలమెల్లగా సమీపించుచుండెను. అతని వెనుకనే మన దయ్యము!

అపుడే చంద్రుఁ డస్తమించియుండెను. భీకరమయిన గాంభీర్యమువలె ఆ శ్మశానమును చీఁకటి యావరించెను. మర్రిమీఁద గబ్బిలములు గీవురు గావురు మనుచుండెను. ఖాదరు గుండెలు కొంచెము కొట్టుకొనియెను. అతఁడు ధైర్యము తెచ్చుకొని ముందుఱు కొక యడుగు వేసెను. వెంటనే రెండడుగులు వెనుకకుఁ బడెను.

నారాయణరావు గబ్బిలముల మోఁతకు భయపడెను. ముందర బుట్టతో నున్న మనుష్యుఁడు మసకమసకగా కానిపించుచుండెను. అతఁడు దయ్య మనుకొని 'దెయ్యం దెయ్యం' అని బిగ్గఱగా అఱచెను. స్తబ్ధమైన ఆశ్మశాన మంతయు ఆయఱపుతో గాండ్రిల్లెను. ప్రక్కనున్న తిప్ప ప్రతిధ్వనించెను.

ఖాదరు వెనుదిరిగెను. వెనుకనే దయ్యము!

అతఁ డొకసంగునఁ బడి ఉడాయించెను.

పదిరోజులవఱకును అతఁడు బడికి పోలేదు. సహాధ్యాయులు ఇంటికిఁ బోయి భోగట్టాచేసిరి. మంచము మీఁదనుండి అతఁడు లేచుటలేదు. 'సైతాన్, సైతాన్' అని కలవరింతలు.

ఈయుఱుకులతో పరుగులతో నారాయణరావు మత్తు కొంచెము సడలఁదొడఁగెను. తా నపుడు శ్మశా

నను ముందు ఉన్నటులు అతఁడు గ్రహించెను. వెంటనే వెనుదిరిగెను.

ఒక యరగడియ నడిచి ఒకసందునఁ బడెను. ముందు ఒకమనుష్యుఁడు పోవుచుండెను. నారాయణరావు వడివడిగా నడచి ఆతని వెనుకకువెళ్లి 'బాబూ' అనిపిలిచెను.

బాబూ అను ఆస్వరము వేయి వికారములుగా నుండెను. కాంతారావు వెనుదిరిగి చూచి త్రుళ్లిపడెను.

కాంతారావు నాటకమున వేషము వేయుటకు వెళ్లెను. నాటకమధ్యమున 'విపరీత-దయ్యము! అమ్మగారు, అచ్చి, ఫాతిమ అందఱును స్పృహతప్పి పడిపోయినారు. దొరగారు ఎచటికో పాఱిపోయిరో యేమో! వారి పత్తా లేదు. ఆదయ్యము బజాఱునఁ బడ్డది. వచ్చునపుడు జాగ్రత్తగా రావలెను' అని రెండుమాఱులు కబురువచ్చెను. ఆ రెండు పిలుపులకును అతఁడు కదలలేదు గాని మూఁడవ పిలుపుతో మఱి ఆఁగలేదు.

'బాబూ! భయపడకు!'

'ఇంటిలో అందఱును అయిరి. ఇఁక నామీఁదికి వచ్చుచుంటివా?' అనిఅనుకొని అతఁడుఉఱుకఁదొడఁగెను.

'బాబూ! నేనే! సైతాన్ కా పహరావ్! ధెయ్యం వేసమ్!'

'నమ్మించి పడఁదోయుదువా? దయ్యాలరీతి నాకు తెలియదనుకొంటివా? అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదూ!' అనిఅనుకొనుచు కాంతారావు దూసినఅమ్మాయెను.

ముందు కాంతారావు; వెనుకనే నారాయణరావు.

కాంతారావు 'అమ్మో దయ్యము!'—బిగ్గన అఱచెను.

నారాయణరావు 'బిగ్గఱగా అఱవకు!' అనెను

కాంతారావు 'నీముండ మొయ్య!' అనెను. నారాయణరావు నవ్వెను. ఆవికారపు నవ్వునకు కాంతారావు బెదిరిపడి మఱికొంచెము వడిగా పరుగిడెను.

మేడమీఁద దీపములు కానవచ్చుచుండెను. అప్పటికి అందఱును మూర్ఛనుండి లేచిరి. ఈపిలుపు విని మేడమీఁద చూచుచు నిలువఁబడిరి.

కాంతారావు 'అరే పహరా జవాన్! తుపాకి తుపాకి!' అనిఅఱచి ఇంటిముందు అలవకుఁ గట్టిన ఇనుప తీఁగెలుమాఁకఁబోయి పైతీఁగమీఁదచిక్కుపడివేలబడెను.

కొడుకు కింద నున్న సైద్దుకాలువలో పడిపోవునేమో యని నారాయణరావు ఎగిరి అతనిని బట్టుకొని తానును వేలాడెను.

అబ్బాయిని దయ్యము మింగనే మింగెనని మాలతి గోలకత్తెను. కాంతారావు దయ్యమును తప్పించుకొనుటకు ఒడలు విదిలించుకొనెను. పడిపోవునను భయముచే నారాయణరావు గట్టిగాఁ బట్టుకొనెను.

పహరా జవాను రసూల్‌సాహెబు తుపాకితో గుఱి చూచుచుండెను. 'కొట్టు కొట్టు! మారో మారో!' అని మేడమీఁదినుండి అఱపులు!

నారాయణరావు గొంతుక చించుకొని 'కొట్టకు కొట్టకు!' అనెను. అతఁడు అటులు అనుటకు చాల ప్రయత్నము చేయవలసివచ్చెను. కుమారుని పట్టుకొనిన పట్టును కొంచెము వదలవలసివచ్చెను. ఆనడుమ కొడుకు విదిలించుకొనెను. దాన కాంతారావును నారాయణరావును సైద్దుకాలువలోఁ బడిరి. నారాయణరావు దయ్యపువేషము మడఁచిన ఇనుపతీఁగె చివర బట్టుకొని కొంత చినిఁగి ఊడి తీఁగమీఁద వ్రేలాడెను. తుపాకిగుండు నారాయణరావు తలమీఁదుగా వెళ్లి తీఁగమీఁది దయ్యపువేసమునుండి దూఱిపోయెను.

'సైతాన్ మర్‌గయా! సైతాన్ మర్‌గయా!' అని పారావాఁడఱచెను. 'ఫాతిమా! నీవు పోయి చూచి రా!' అని మాలతి అనెను.

'హాచ్చీ కీ ఘంఘండి!' అని ఫాతిమా యనెను. ఇంతలో సైద్దుకాలువలో స్నానము చేసి తండ్రి కొడుకు లొకరి నొకరు చూచికొనుచు ఒడ్డెక్కిరి.

'ఇదియేమి ఇదియేమి?' అని కాంతారావనెను.

'నే నీనాఁడు పరిశోధన చేయుటకు దయ్యాల మఱ్ఱికడకు వెళ్లితిని. నే నీదయ్యపు వేషముతో కొన్ని పరిశోధనలు చేసితిని. పరిశోధనల ఫలితములు మెల్లగా తెలుపవలసియున్నవి' అని కాలుచున్న దయ్యపువేషమును ఆర్పి పోలీసులు దరియాప్తు చేయక ముందె నారాయణరావు మేడమీఁదికి పరుగెత్తెను.